# దొరకని దొంగ

## మల్లాది వెంకట కృష్ణమూర్తి

ఇన్‌స్పెక్టర్ ఇంద్రనీల్ పోలీస్ స్టేషన్‌కి వచ్చేసరికే అతను ఇన్‌స్పెక్టర్ కోసం ఎదురుచూస్తున్నాడు.

"నమస్తే నా పేరు దశరథ్." పరిచయం చేసుకున్నాడు లేచి నిలబడి.

"నమస్తే కూర్చోండి" చెప్పాడు ఇంద్రనీల్ తను కూర్చుంటూ.

దశరథ్ వంక చూశాడు. రాత్రంతా నిద్ర లేనట్లుగా మొహమంతా వుబ్బివుంది. కళ్ళు ఎర్రగా వున్నాయి.

"చెప్పండి"

"రాత్రి మా ఇంట్లో దొంగలు పడ్డారు."

"ఏం పోయింది?"

"నా భార్య నగలు, వెండికంచాలు, కొంత కేష్....అది తక్కువేలెండి. తర్వాత నా భార్య పట్టుచీరలు."

"మీరుండేది ఎక్కడ?"

"సూర్యారావుపేట. క్రెవెన్ సందులో,"

"మీ జాబ్?"

"మెడికల్ షాపుంది మాకు."

"రాత్రి ఇంట్లో లేరా మీరు, దొంగతనం జరిగేటప్పుడు?"

"సెకండ్ షో సినిమాకి వెళ్ళాం నేనూ, నా భార్య. ఇంగ్లీష్ సినిమా. ఇంటికి వచ్చేసరికి పన్నెండున్నర దాటింది. లోపల లైటు వెలుగుతోంది. లైటు ఆర్పటం మర్చిపోయావా అని అడిగాను నా భార్యని. ఆర్పానంది. లోపలికి వెళ్ళి చూస్తే బీరువా తలుపు బార్లా తెరచి వుంది. లోపల విలువయినవన్నీ మాయమయాయి....బాధగా ఆగాడు దశరథ్.

"మీ యింటి తాళం పగలకొట్టారా దొంగలు?"

"లేదు. వేసిన తాళం వేసినట్లుగానే వుంది. అదే ఆశ్చర్యం. మారుతాళం చెవితో తలుపు తాళం, బీరువా తాళం తీసి అంతా మూటకట్టుకుని బయటకి వెళుతూ మళ్ళీ ఇంటితాళం వేసేసి వుంటాడు."

"రాత్రే ఎందుకు రాలేదు?" అడిగాడు ఇన్‌స్పెక్టర్ ఇంద్రనీల్.

నా భార్య భయపడింది. తనని ఒంటరిగా వదిలి వెళ్ళడం దే రాలేదు."

ఇంద్రనీల్ ఓ తెల్లకాగితం, పెన్ను అందించి చెప్పాడు దశరథ్‌తో.

"ముందర రిపోర్టు రాసివ్వండి. పోయిన వస్తువుల జాబితా వివరంగా....అంటే పట్టు చీరల రంగు, అంచు వగైరాలు....క్లియర్‌గా రాయండి."

కాగితం అందుకుని రాయబోతూ చెప్పాడు దశరథ్.







"అన్నట్లు నాలుగు రోజులక్రితం ఎవరో మా ఇంటికివచ్చి నేనున్నానా అని అడిగాడు. మా ఆవిడ లేరని చెప్పింది. నేను వచ్చేదాకా వెయిట్ చేస్తానంటే మా ఆవిడ షాపు అడ్రస్ చెప్పి అక్కడికి వెళ్ళమన్నదట."

"ఎవరతను?"

"నాకు తెలియదు. ఇది వాడి పనేనేమో అనిపిస్తోంది ఇప్పుడు."

దశరథ్ రిపోర్టు రాసి సంతకం పెట్టి అందించాడు ఇన్‌స్పెక్టర్ ఇంద్రనీల్‌కి. ఇంద్రనీల్ లేచి నిలబడి చెప్పాడు.

"పదండి. మీ ఇంటికి వెళదాం."

ఇంద్రనీల్ మోటార్ సైకిల్ మీద పది నిమిషాల్లో సూర్యారావుపేటలోని దశరథ్ ఇంటికి చేరుకున్నారు ఇద్దరూ.

దశరథ్ భార్య మొహంమీద ఆమె బాగా ఏడ్చిన గుర్తులున్నాయి.

"మీ కెవరిమీదయినా అనుమానంవుందా?" అడిగాడు కూర్చున్నాక.

"నాలుగు రోజులక్రితం వచ్చినవాడి పనేమోనని మా ఆవిడ అభిప్రాయపడుతోంది" చెప్పాడు దశరథ్.

"ఇదివరలో ఎప్పుడయినా వాణ్ణి చూశారా?" అడిగాడు ఇంద్రనీల్.

ఆవిడ తల అడ్డంగా వూపింది సమాధానంగా.

"ఎలా వుంటాడు?"

"ముప్పై అయిదు, నలభై మధ్య వుంటాడు. గిరజాల జుట్టు ఖద్దరు బట్టలు తొడుక్కున్నాడు."

"తెలుగే మాట్లాడాడా?"

"అవును."

ఇంద్రనీల్ వాళ్ళ ఇంటినీ, బీరువాని పరిశీలించాడు. బీరువామీద తాళంచెవి రంధ్రం వున్నచోట అక్కడ కూడా గీతలుండటం గమనించాడు. సినిమాకి వెళుతూ వాళ్లు ఇంటికి వేసిన తాళంకప్పని పరీక్షించాడు. గాడ్రేజ్ నవతాళ్ అది.

"మాకు పెళ్ళయి మూడు నెలలే అయింది" చెప్పాడు దశరథ్, ఇన్‌స్పెక్టర్ పిల్లలు ఎవరూ

లేరా అన్న ప్రశ్నకి సమాధానంగా.

"మీరు వీలున్నప్పుడోసారి స్టేషన్‌కి వస్తే నాదగ్గరున్న కేడిల ఫోటోలు చూపిస్తాను. వాటిలో మీ ఇంటికి వచ్చినవాడున్నాడేమో చూద్దురుగాని."

"నేను గుర్తుపట్టలేకపోతే? ఒకటి రెండు నిముషాలకంటే ఎక్కువసేపు చూడలేదు నేను వాడ్ని" అన్నది దశరథ్ భార్య.

"ప్రయత్నించండి. వాడిని గుర్తు తెచ్చుకునే ప్రయత్నం చేయండి ఈలోగా."

"ఎన్ని రోజుల్లోగా దొరకచ్చు?" అడిగింది పక్కింటావిడ.

సమాధానం చెప్పలేదు ఇంద్రనీల్. నవ్వాడు.

నిన్నరాత్రి మీకు ఎలాంటి అలికిడి వినిపించలేదా?" అడిగాడు.

తల అడ్డంగా వూపిందావిడ. ఆ సందులో మరికొందరిని విచారించాడు ఇంద్రనీల్. కాని లాభం లేకపోయింది.

"మీరెలాగయినా ఆ దొంగని పట్టుకోవాలి సార్. పదివేలరూపాయల సామాను పోయింది మొత్తం" చెప్పాడు దశరథ్.

"ఐ షల్ డు వాట్ బెస్ట్ కెన్ బి డన్."

○ ○ ○

ఇన్‌స్పెక్టర్ ఇంద్రనీల్ రొటీన్‌గా చేయాల్సిన పరిశోధన చేసాడు. ఆ దొంగగురించి అంతుపట్టలేదు.

దశరథ్ తన భార్యని పోలీస్ స్టేషన్‌కి తీసుకువచ్చాడు. దొంగల ఆల్బం ఆవిడకి చూపించాడు.

ఒకరిద్దరి ఫొటోలు చూపించి వాళ్ళయి వుండచ్చనే అనుమానాన్ని వ్యక్తం చేసింది. ఇంద్రనీల్ చెక్ చేసాడు. వాళ్ళలో ఒకడు జైల్లో వున్నాడు. మరొకడు విజయవాడలోనే లేడు.

దొంగిలించబడ్డ బట్టలు కొనేవాళ్ళందరి మీదా ఓ కన్నువేసి వుంచాడు, కాని, లాభం లేకపోయింది.

దశరథ్ మొదట్లో రోజూ ఓసారి దొంగ దొరికాడా అని తెలుసుకోవడానికి వచ్చేవాడు. తర్వాత వారానికోసారి వచ్చేవాడు. నెల దాటాక యెప్పుడయినా ఓసారి ఫోన్ చేస్తూండేవాడు. అయిదారు నెలలు దాటాక ఇక ఆ సంగతి మర్చిపోయాడు.

కాని ఇన్‌స్పెక్టర్ ఇంద్రనీల్ మాత్రం మరిచిపోలేదు. అనేకసార్లు అడిగి తెలుసుకున్నాడు ఆ నగలు ఏ డిజైన్‌లో, ఏ రకంగా వుంటాయో. మిగతా పోలీస్ స్టేషన్లకి వాటి వివరాలు సర్క్యులేట్ చేసాడు. మరోచోట ఆ దొంగ పట్టుబడితే, అతనిదగ్గర ఇంకా ఆ నగలు వుండి వాటినికూడా పోలీసులు పట్టుకుంటారనే ఆశతో రొటీన్‌గా వాటి వివరాలు పంపాడు.

దాదాపు ఎనిమిది నెలలు గడిచాయి దశరథ్ ఇంట్లో దొంగతనం జరిగి. మరో దొంగతనం కేసు విచారిస్తూ ఇంద్రనీల్ ఓ కంసాలి దగ్గరికి వెళ్ళాడు ఆ రోజు. ఆ కంసాలి చేసిన నగలున్న పెట్టె పోయింది. వాటి వివరాల గురించి అడుగుతుండగా కంసాలి చేతిలోకి తీసుకున్న మామిడి పిందెల గొలుసుమీద పడింది ఇంద్రనీల్ దృష్టి.

"మామిడి పిందెల గొలుసు!" దశరథ్ భార్య చెప్పిన మాటలు గుర్తుకొచ్చాయ్.

"మామిడిపిందెల గొలుసు యీ రోజుల్లో అట్టే ఫేషన్ కాదు. మా అమ్మా, మా నాన్న ఎప్పుడో చేయించి పెళ్ళిలో నాకు పెట్టారు"

ఇంద్రనీల్ దాన్ని అందుకుని పరిశీలనగా చూసాడు. అది తయారు చేసిన కంసాలి ఇనీషియల్స్ వున్నాయి ఆ గొలుసు మీద 'జె. బి.'

"ఎన్ని కాసులుంటుంది?" అడిగాడు.


"మూడున్నర"

"ఇదెక్కడిది మీకు?"

"ఓ కష్టమర్ దాన్ని కరిగించి చెయిన్ చేయమని మూడు రోజుల క్రితం యిచ్చారు"








"ఇదేనా లేక యింకేయినా యిచ్చారా?"

"ఎందుకు?" అనుమానంగా చూస్తూ అడిగాడు ఆ కంసాలి.

"చెప్పండి. ఇంకా ఏం యిచ్చారు?"

"రెండు జతల గాజులు, ఓ వుంగరం"

"ఎర్రరాయి వుంగరమా?"

"అవును?"

"ఏవీ "

కంసాలి అందించిన ఆ మిగతా వస్తువులు చూసాక చిన్నగా ఈల వేసాడు ఇంద్రనీల్.

"ఎవరిచ్చారివి?"

"మాచవరంలో వుంటారు తాతా రావుగారని. ఏదో కాలేజీలో క్లర్క్‌గా పనిచేస్తున్నారాయన"

"వాటిని కరిగించకండి. మీ దగ్గరే జాగ్రత్తగా వుంచండి. ఆయన ఎడ్రస్ చెప్పండి"

"ఆదేం?"

"ఇదంతా దొంగ సరుకు"

"ఛీ. ఆయన అలాంటి వాడుకాదు. నాకు పదిహేనేళ్ళుగా తెలుసాయన"

"ఆయనని దొంగనటం లేదు, ఇవి ఆయనకి ఎలా వచ్చాయో తెలుసుకోవాలి. ఆ దొంగ దగ్గర కొని వుండచ్చు"

ఇన్‌స్పెక్టర్ ఇంద్రనీల్ అరగంట తర్వాత మాచవరం డౌన్‌లోని తాతారావు ఇల్లు చేరుకున్నారు. ఆయన ఇంట్లో లేడు. ఆయన భార్య, కూతురు వున్నారు.

ఇన్‌స్పెక్టర్‌ని చూడగానే వాళ్ళ మొహాల్లో ఆశ్చర్యం తొంగి చూసింది.

"తాతారావు గారిల్లే నా యిది?" అడిగాడు ఇంద్రనీల్.

"అవును.......?"

"ఉన్నారా?"

"బందరెళ్ళారు. దేనికి?"

"ఆయన కంసాలికి కొన్ని నగలిచ్చారట కరిగించి వేరేవి తయారు చేయమని. అవి ఎలా వచ్చాయో చెప్పగలరా మీరయినా?"

వెంటనే తల్లీ, కూతుళ్లిద్దరూ ఒకరి మొహాలొకరు చూసుకున్నారు. కూతురే తేరుకొని అడిగింది.

"మీకా వివరం ఎందుకు?"

"దొంగిలించబడ్డ నగలవి. ఎనిమిది నెలల క్రితం సూర్యారావుపేటలోని దశరథ్ అనే అతని ఇంట్లో అవి పోయాయి"

కూతురు చెప్పింది నెమ్మదిగా.

"కూర్చోండి"

ఇంద్రనీల్ కూర్చున్నాడు. అది పక్కా మధ్య తరగతి ఇల్లులా వుంది.

"నాకు తెలుసు. నేను చెప్తాను" అన్నదా అమ్మాయి.

"చెప్పండయితే"

"అవి మా అక్కయ్యవి."

"ఆవిడకి ఎక్కడివి?"

"మా నాన్నగారు పెళ్ళిలో పెట్టారు... పెట్టాల్సివచ్చింది."

ఇంద్రనీల్‌కి ముప్పాతిక భాగం అర్థమయిపోయింది సంగతి.

"దశరథ్ మీ అక్క మొగుడా?" అడిగాడు వెంటనే.

తలవూపి చెప్పింది.

"పదివేలు కట్నం ఇచ్చుకోలేం. కట్నం ఇవ్వకుండా మావాళ్ళు ఎంతకాలం ఇంట్లో వుంచుతారు? మా అమ్మ నగలు ఇచ్చాం. ఆ రాత్రి వాళ్ళు సినిమాకి వెళ్ళాక మా అక్క ఇచ్చిన డూప్లికేట్ తాళం చెవులు వుపయోగించి వాటిని నేనే దొంగిలించాను. మా బావగారికి తప్ప మాకు ఈ ఏర్పాటు గురించి పెళ్ళికి ముందే తెలుసు. నా పెళ్ళి సెటిల్ అయింది. కట్నం ఇవ్వాలి. పన్నెండు వేలు అడిగితే వప్పుకున్నారు నాన్నగారు..."

ఇన్‌స్పెక్టర్ ఇంద్రనీల్ లేచి నిలబడ్డాడు. వెంటనే.

"నన్ను అరెస్ట్ చేస్తారా?" అడిగింది భయంగా.

నవ్వి తల అడ్డంగా వూపాడు.

"నగలు కరిగించి వేరే చేయిసే పెళ్ళిలో ఎవరూ గుర్తుపట్టరనా?" అడిగాడు ఆ అమ్మాయిని.

అవునన్నట్లుగా తల వూపింది.

"ఈ రోజుల్లో కట్నం ఇవ్వలేని మా నాన్నగారిలాంటి పేదవాళ్ళ దగ్గర నుండి కూడా కట్నం గుంజాలనుకుంటున్నారు కుర్రాళ్లు. ఏం చెయ్యం చెప్పండి?" అడిగిందా అమ్మాయి.

"మా పెద్దల్లుడికి సంగతి చెప్తారా?"

తాతారావు భార్య అడిగింది. ఆవిడ కంఠంలో యింకా భయం తగ్గలేదు.

"కాపురాలు కూల్చడం నా వృత్తి కాదు. నేనిక్కడికి రాలేదు మిమ్మల్నేం అనగలేను. అసలు ఆ నగలు ఏమయ్యాయో కూడా నాకు తెలియదు" చెప్పాడు.

"వెరీ మెనీ థాంక్స్"

"కట్నం తీసుకోవడం కూడా దొంగతనం అంత నేరం."

"కొద్దిగా కాఫీ తీసుకోండి." తల్లీ, కూతుళ్ళిద్దరూ ఒకేసారి అన్నారు.

○ ○ ○

కొన్ని వారాల తర్వాత వుదయం పోస్ట్ చూసుకుంటూంటే ఇన్‌స్పెక్టర్ ఇంద్రనీల్ కోసం పోలీస్ స్టేషన్‌కి ఓ అమ్మాయి వచ్చింది. చేతిలోని శుభలేఖ అందించింది సిగ్గుగా.

"నా పెళ్ళి. ఎల్లుండి. తప్పక రావాలి మీరు."


ఇంద్రనీల్ శుభలేఖ చదివి, నవ్వి చెప్పాడు.

"థాంక్స్. తప్పక వస్తాను. నేను ఇదివరలో వద్దన్న కాఫీ అక్కడ తాగుతాను... బై దిబై... హార్టీ కంగ్రాచ్యులేషన్స్." ✱




# డెట్ బిళ్ల వాడండి, తెలుపును పొందండి

ఇపుడు ముందుకంటే
ఎంతో ఎక్కువ మంది
డెట్ బిళ్ల యొక్క
ఉజ్వలమైన ఉతుకును
ఇష్టపడుతున్నారు;
వారంటారు,
ఇది మిరమిట్ల తెలుపును,
ఎంతో ఎక్కువగా
పొదుపును ఇస్తుంది.




# డెట్ బిళ్ల

Shilpi-DM-41 A/80 Tel.